ఈనాడు
మహబూబాబాద్
శనివారం సెప్టెంబరు 28, 2024

నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష

తొర్రూరు, న్యూస్‌టుడే: మోసానికి పాల్పడిన తొర్రూరుకు చెందిన గణపురం సోమయ్యకు తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మట్ట సరిత మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు. 2016లో సోమయ్య.. తనకు భూమి లేకపోయినా ఉన్నట్లుగా చూపించి సోమలక్ష్మికి విక్రయించి డబ్బులు తీసుకొని మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమయ్యకు శిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధం


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి లక్ష్మణ్‌నాయక్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యాచరణకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌ఛార్జి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. శుక్రవారం భాజపా జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 30న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ట్రెజరీ ద్వారా వేతనాలు పొందుతున్న ప్రతి ఉపాధ్యాయుడు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, జిల్లా అధికార ప్రతినిధి ధార ఇందూభారతి, ఎం.సురేందర్‌రెడ్డి, పైండ్ల శ్రీనివాస్, శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.

ఆకేరు పొడవునా.. ఇసుకాసురులదే ఇష్టారాజ్యం!





ఉమ్మడి వరంగల్‌లో సాగు, తాగునీటికి కీలకమైన ఆకేరు వాగు.. ఇసుక అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. కాసులు కురిపిస్తుండడంతో నిబంధనలను ఇసుకలో తొక్కేస్తున్నారు. మూడు జేసీబీ యంత్రాలు.. ఆరు ట్రాక్టర్లు అన్నచందంగా అడ్డదారుల్లో రేయింబవళ్లు తవ్వి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల మద్దతు.. మరికొన్ని చోట్ల పోలీసులు 'మామూలు'గా తీసుకుంటుండడంతో వారిని ఏం చేయలేని పరిస్థితి.. నిత్యం వందలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడుతుండడంతో నీటి నిల్వల కోసం రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాంలు సైతం వరదలకు కొట్టుకుపోతున్నాయి. జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల గుండా ప్రవహించే ఈ వాగులో ఇసుక అక్రమ రవాణా ఎక్కడెక్కడ జరుగుతుందో పరిశీలించి 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఈనాడు, మహబూబాబాద్

రోజువారీ ఇసుక అక్రమ రవాణా ఇలా	
ట్రాక్టర్లు	350
ఒక ట్రాక్టర్లో రవాణా (క్యూబిక్ మీటర్లు):	3
మొత్తం తరలిస్తోంది (క్యూబిక్‌మీటర్లు):	1050
ఒక ట్రాక్టర్ ఇసుక ధర: రూ.	6000
అక్రమార్కులు పొందుతున్న ఆదాయం(రూ.లక్షలు)	21

120.6 కి.మీ. ప్రవాహం

జనగామ జిల్లా చిల్పూరు మండలం పైపాటు నుంచి ప్రారంభమయ్యే చిన్న ప్రవాహం నష్కల్ వద్ద ఆకేరు వాగుగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇది ఉమ్మడి వరంగల్ పరిధి 4 జిల్లాల్లోని 13 మండలాల్లో 46 గ్రామాల మీదుగా 120.6 కి.మీ. ప్రవహిస్తోంది. పరివాహకంలోని దాదాపు 35 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తోంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందడానికి దోహదపడుతోంది.


ఇల్లంద సమీపంలో

● జఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామ సమీపంలో వరద పెరగక ముందు 25 నుంచి 30 ట్రాక్టర్ల ఇసుకను తరలించేది. ఇప్పుడు వరద ప్రవాహం ఉన్నా 15 ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు.

● ఐనవోలు మండలం నందనం, రాంనగర్ ప్రాంతాల్లో తవ్వకాలకు నెల రోజులుగా చెక్ పడింది. గతంలో ఇక్కడ పనిచేసిన పోలీసు అధికారి అండదండలతోనే రవాణా జరిగేదనే ఆరోపణలున్నాయి. నేపథ్యంలో ఇప్పుడు కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్సై వాగులోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. సుమారు 100 ట్రాక్టర్లు ఇక్కడే పరిమితమయ్యాయి. కొందరు అక్రమార్కులు రాత్రిపూట తరలిస్తున్నట్లు సమాచారం. మరికొందరు ఎలాగైనా అధికారులను మచ్చిక చేసుకుని ఇసుక రవాణా చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది.

● వర్ధన్నపేట మండలం ఇల్లంద, వర్ధన్నపేట, కొత్తపల్లి, ల్యాబర్తి ప్రాంతంలోని వాగు నుంచి ప్రతి రోజు 250 ట్రాక్టర్ల ఇసుక నగరానికి తరలుతోంది. తెల్లవారుజామున 3 గంటలకు ఖమ్మం-వరంగల్ 563వ జాతీయ రహదారిపై దాదాపు 2 కి.మీ. పొడవునా ట్రాక్టర్ల వరుస కనిపిస్తుంది. తోడేందుకు జేసీబీ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇసుకతో కూడిన మట్టిని సైతం వాగులోనే నింపి నీటితో మట్టిని వేరు చేస్తున్నారు.


కొత్తపల్లిలో మట్టిని వేరు చేశాక..


ల్యాబర్తిలో జేసీబీ యంత్రం ద్వారా..

● పర్వతగిరి మండలంలోని చెరువుముందుతండాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారుల నిఘాతో తవ్వకాలు నిలిచాయి. త్వరలోనే తవ్వకాలు చేసేందుకు అక్రమార్కులు అధికారులు తమని పట్టించుకోకుండా చూడాలని పేరున్న ప్రజాప్రతినిధిని కలవాలని సన్నద్ధమవుతున్నారు.

తవ్వకాలను అడ్డుకోవాలని చెప్పాం..

రెవెన్యూశాఖలో కిందిస్థాయి సిబ్బంది లేకపోవడంతో అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టలేకపోతున్నాం. తవ్వకాలను అడ్డుకోవాలని, పోలీసుల సహకారంతో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల తహసీల్దార్లకు చెప్పామని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు పేర్కొన్నారు.

వాగు నుంచి చెరువుకు

జఫర్‌గఢ్ మండలం కోనాచలం ప్రాంతంలోని వాగు నుంచి వర్ధన్నపేట పెద్ద చెరువులోకి వరదనీరు వెళ్లేలా కట్టు కాలువ నిర్మించారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి ప్రాంతంలోని మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా రాయపర్తి మండలం కొత్తూరులోని రెండు చెరువుల్లోకి, అక్కడి నుంచి పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ చెరువులోకి వరదనీరు వెళ్తోంది. నెల్లికుదురు మండలం ఎర్రబెల్లి గూడెం వద్ద వాగుపై ఉన్న మత్తడి వద్ద నిర్మించిన కట్టుకాలువ ద్వారా నెల్లికుదురు పెద్ద చెరువులోకి ఆకేరు వరద ప్రవహిస్తుంది. అక్కడా అక్రమ రవాణా సాగుతోంది.


నెల్లికుదురులోని వాగులో నీటిలో దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగుతున్న మరో రెండు ట్రాక్టర్ ఇంజిన్లు



● నెల్లికుదురు మండలం నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, మునీగలవీడు సమీపంలోని వాగుల్లోంచి ప్రతి రోజు 35 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది. వరదనీటిలోంచే ఇసుకను తవ్వి తరలిస్తున్నారు.


నర్సింహులపేట మండలం జయపురం, చిన్నగూడూరు మండలం చిన్నగూడూరు, మరిపెడ మండలం బీచ్‌రాజుపల్లి, ఉల్లేపల్లి ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లోంచి 50 ట్రాక్టర్ల ద్వారా రవాణా జరుగుతోంది.

కేసులు ఇలా..

వరంగల్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 45 కేసులు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 64 నమోదు చేసి 96 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 98 వాహనాలను పట్టుకుని కేసులు పెట్టకుండా మైనింగ్‌శాఖకు అప్పగించారు.


మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద..

చేయి తడిపితేనే దస్త్రం కదిలేది..!

టాస్క్‌ఫోర్స్

ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, తొర్రూరు: జిల్లాలోని రెవెన్యూ శాఖలో చేయి తడిపితేనే దస్త్రం ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తొర్రూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఓ తహసీల్దార్ కార్యాలయం అవినీతికి కేంద్రమైంది. ఇక్కడ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, తదితర పనులకు వెళ్లిన వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా పనుల కోసం కార్యాలయానికి వెళ్లిన ప్రతి ఒక్కరు ముందుగా ధరణి విభాగంలో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగిని కలవాలి. అతనిని కాదని రెవెన్యూ అధికారులను కలిసి తమ పని గురించి వివరించినా కాలయాపన తప్పదు. కారణం ధరణితో ముడిపడి ఉన్న ప్రతి దానికి ముందుగా అతన్ని ప్రసన్నం చేసుకోవాలి. ఆ పనికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకోవాలి. లేనిపక్షంలో దస్త్రం ముందుకు కదలదనే ఆరోపణలున్నాయి. పైగా బాధితులతో మాట్లాడే వ్యవహారశైలి కూడా సరిగా ఉండదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధర కుదిరితేనే పని

చేసేది పొరుగు సేవల ఉద్యోగమే కానీ అక్కడ అతని మాటే శాసనమన్నట్లు కొనసాగుతుందని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ధరణిలో పని పూర్తికావాలంటే ధర కుదిరితేనే సర్వర్ పని చేస్తుంది. రూ.15 వేలకు తక్కువ కాకుండా సమర్పించాలి. లేదంటే ఆ బాధితుడి పని వరకు వచ్చే సమయానికి సర్వర్ పనిచేయదనే మాట వినిపిస్తుంది. అది అర్థం కాక పలువురు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగారు. చివరకు ముడుపులు సమర్పించుకుని పనులు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల ఒక ప్రభుత్వ ఉద్యోగి తమ బంధువులకు సంబంధించిన భూమి పని కోసం కార్యాలయానికి వెళ్లారు. రెవెన్యూ అధికారులను కలిసినప్పటికీ ఆ పొరుగు సేవల ఉద్యోగి వద్దకు వెళ్లి తను వచ్చిన విషయం గురించి చెప్పారు. తాను కూడా ఒక ప్రభుత్వ ఉద్యోగినేని చెప్పారు. పని పూర్తి కావాలంటే ముడుపులు సమర్పించాల్సిందేనని అనడంతో విధిలేని పరిస్థితుల్లో అంగీకరించారు. నేరుగా తీసుకోకుండా తనకు తెలిసిన వ్యక్తుల ఫోన్‌పేకు సుమారు రూ.15 వేలు పంపించాలన్నారు. దీంతో ఆయన ఆ సొమ్ము ఆ వ్యక్తికి పంపినట్లు సమాచారం.

ఆరోపణలెన్నో..

ధరణి విభాగంలో పనిచేస్తున్న పొరుగు సేవల ఉద్యోగిపై గతంలో ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో గతేడాది వరకు పనిచేశారు. అప్పటి కలెక్టర్‌కు అతని పనితీరు తెలిసి చర్యలు తీసుకునే సమయానికి ఆ ఉద్యోగి వరంగల్ జిల్లాలోని ఒక మండలానికి వెళ్లారు. కలెక్టర్ బదిలీపై వెళ్లడంతో పైరవీ చేయించుకుని మళ్లీ తొర్రూరు కార్యాలయానికి వచ్చారు.

లంచం అడిగారు.. అనిశాకు చిక్కారు!


పట్టుబడిన నగదుతో ఏటీవో రవీందర్, ఈఈ హుస్సేన్ (పసుపు రంగు చొక్కా)

జనగామ, న్యూస్‌టుడే: ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన సంఘటన జనగామ కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడెంకు చెందిన మాజీ సైనికుడు చిర్ర సత్యపాల్‌రెడ్డి ఇదే మండలంలోని నెల్లుట్ల- లింగాలఘనపురం రహదారి పక్కన పెట్రోలు బంకును ఏర్పాటు చేసేందుకు తన భార్య పేరిట దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశిత రుసుము చెల్లించారు. ఆయనకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు ఆర్అండ్‌బీ ఈఈ హుస్సేన్ రూ.14 వేలు డిమాండ్ చేశారు. దీంతో సత్యపాల్‌రెడ్డి వరంగల్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఈఈ చిలుకపాటి హుస్సేన్‌కు రూ.12 వేలు, ఏటీవో రవీందర్‌కు రూ.2 వేలు ఇస్తుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని శనివారం ఉదయం కోర్టులో హాజరుపర్చనున్నట్లు సాంబయ్య తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నెంబరు 1064కు ఫోన్ చేయాలని కోరారు.

జనగామ జిల్లా కలెక్టరేట్‌లో వరుసగా వెలుగు చూస్తున్న అవినీతి ఘటనలపై ప్రత్యేక కథనం..

'పట్టుబడుతున్నా..పట్టింపు లేదా?' 6లో..

గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయి, కారుతో ఎస్పీ రాంనాథ్ కేకన్, పోలీసులు

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం స్టేజీ వద్ద 365 జాతీయ రహదారిపై కారులో రవాణా చేస్తున్న ఎండు గంజాయిని మరిపెడ పోలీసులు పట్టుకున్నారు. ఎస్పీ రాంనాథ్ కేకన్ మరిపెడ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భద్రాచలం సమీపంలోని సీలేరు నుంచి హైదరాబాద్‌కు కారులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమ జిల్లా కుంట మండలం అసిర్గుడెం రెవెన్యూ ఉద్యోగి సోడి నాగేశ్వరరావు 61 ప్యాకెట్లలో 125 కిలోల ఎండు గంజాయి తరలిస్తుండగా మరిపెడ మండలం గాలివారిగూడెం స్టేజీ వద్ద ఎస్సై సతీష్ నేతృత్వంలోని పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఆ గంజాయిని నిందితుడు రూ.3.81 లక్షలకు కొనుగోలు చేశాడని, దీని మార్కెట్ విలువ రూ.31.75లక్షలు ఉంటుందన్నారు. నిందితుడి పట్టుకునేందకు చాకచక్యంగా కృషి చేసిన సీఐ రాజ్‌కుమార్, ఎస్సైలు సతీష్, సంతోష్, పీఎస్ఐ అశోక్, హెడ్ కానిస్టేబుల్ వాల్య, కానిస్టేబుళ్లు స్వామి, ఉమాకర్, వెంకన్న, లింగయ్య, రవీందర్, హోమ్‌గార్డ్ కృష్ణమూర్తిలను ఎస్పీ అభినందించారు.

అభయారణ్యంలో అడవి పంది వేట..?

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం అభయారణ్యంలోని ఓ గ్రామంలో కొందరు వేటగాళ్లు అడవిపందిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నారని అటవీశాఖ అధికారులు శుక్రవారం గ్రామంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవిజంతువును వేటాడి మాంసాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు సంఘటనాస్థలికి వెళ్లారు. ఆ సమయంలో సంబంధిత వ్యక్తులు కొందరు పరారయ్యారని మరికొందరిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. అడవిజంతువును వధించి మాంసం విక్రయిస్తున్న సంఘటన తెలిసిన ఓ అధికారి చూసిచూడనట్లుగా వ్యవహరించినట్లు తెలిసింది. మరో అధికారికి వచ్చిన సమాచారంతో దాడులు చేసినట్లుగా ప్రచారం జరిగింది. ఈ విషయమై బయ్యారం డీఆర్వో ఉమారాణిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అడవిపంది మాంసం విక్రయం విషయమై విచారణ చేస్తున్నామని తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రవీంద్రశర్మ

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ తెలిపారు. కక్షిదారులు రాజీకి వచ్చి తమ కేసులను పరిష్కరించుకొని ప్రశాంత జీవనం గడపాలన్నారు. రాజీ చేసుకోవడం అంటే ఇరు పక్షాల వారు గెలిచినట్లే అవుతుందన్నారు. క్షణికావేశాలతో కేసుల పాలై కోర్టుల చుట్టూ తిరిగి ఇబ్బందులకు గురవుతున్న వారికి లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. కేసులు పెండింగ్‌లో ఉన్న వారు సంబంధిత పోలీస్ స్టేషన్ ద్వారా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి తెలిపారు.


కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ

నమూన ఎన్నికల ప్రక్రియ..!

డోర్నకల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రైవేటు బడులకు తీసిపోని రీతిలో ప్రయోగాత్మక బోధన జరుగుతోంది. తరగతి గదిలో బోధించిన పాఠంలోని ఎన్నికల ప్రక్రియని ఉపాధ్యాయులు కళ్లెదుట నమూనాతో సాక్షాత్కరింపజేశారు. డోర్నకల్ మండలం చిల్కోడు జడ్పీ పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలోని 'భారతదేశంలో ఎన్నిక ప్రక్రియ' పాఠం బోధించారు. ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు పూర్తిగా బోధపడేలా నమూనా పోలింగ్‌ను నిర్వహించారు.


బ్యాలెట్లు భద్రపరిచిన గదికి కాపలా


29న ఖమ్మంలో యాదవ సదస్సు

గార్ల, న్యూస్‌టుడే: ఖమ్మంలో ఈ నెల 29న నిర్వహించనున్న యాదవ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు సూత్రపు రాజు యాదవ్ కోరారు. గార్లలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాదవులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. దామాషా ప్రకారం యాదవులకు నామినేటెడ్ పదవులు కేటాయింపులో చిన్నచూపు చూస్తోందన్నారు. ఖమ్మం సదస్సు ద్వారా ఆత్మగౌరవం కోసం పోరాడాలని కోరారు. జిల్లా కార్యదర్శి కె.బాబురావు, మండలాధ్యక్షుడు చెవుల మహేష్, గౌరవాధ్యక్షుడు జి.రామయ్య, పి.లింగన్న, రవి, మోహన్ తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల దృష్టి

నాలాలపై ఉన్నవాటికి నోటీసులు

కేసముద్రం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో నాలాలపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరుతూ పంచాయతీ అధికారులు శుక్రవారం వరకు 62 మందికి నోటీసులు ఇచ్చారు. మరో 150 మందికి నోటీసులు ఇవ్వనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల కేంద్రంలోని అంబేడ్కరు కూడలి, సంతోష్‌నగర్ కాలనీ, ఉప్పరపల్లి రోడ్డు, అమరవీరుల స్తూపం తదితర ప్రాంతాలు జలమయమై ఇళ్లు, దుకాణాల్లోకి నీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. నష్టపోయిన ప్రజలను పరామర్శించడానికి ఈ నెల 2న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్, కలెక్టరు మండల కేంద్రంలో సందర్శించారు. నాలాలు ఆక్రమించడంతోనే వరుద నీరు ఇళ్లలోకి వచ్చినట్లు స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు. కలెక్టరు ఆదేశాలతో నాలాలు పరిశీలించగా సంతోష్‌నగర్ నుంచి అమరవీరుల స్తూపం మీదుగా ఉప్పరపల్లి రోడ్డు వరకు 20 అడుగులు, గిర్నితండా నుంచి మార్కెట్ ప్రహరీ పక్క నుంచి రైల్వే ట్రాక్ వరకు 15 అడుగులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బైపాసు రోడ్డు వరకు 15 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలాపై ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. నోటీసులు అందిన మూడు రోజుల్లోపు అక్రమ నిర్మాణాలు తొలగించాలని తెలిపారు. లేని పక్షంలో పంచాయతీ రాజు చట్టం 2018 సెక్షన్ 52, 94 ప్రకారం పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించనున్నట్లు తెలిపారు.



ఆకాశానికి పచ్చని పందిరి

ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు కలిసిపోయి, ఆకాశానికి పందిరి వేసినట్లు ఈ రోడ్డు ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా వెళ్తుంటే అడవిలో నుంచి వెళ్తున్నట్లు అనుభూతి కలుగుతోంది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రం నుంచి కొత్తకొండకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర ఎటు చూసినా పచ్చదనం నిండి కనువిందు చేస్తోంది.

- ఈనాడు, హనుమకొండ

ఓరుగల్లుకు ‘ఘన’ స్వాగతం!



ఓరుగల్లు.. ఎటుచూసినా.. చారిత్రక ఆలయాలు, గొలుసుకట్టు చెరువులు కనిపిస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయిస్తంభాల ఆలయంతో పాటు ఇతర ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేల మంది పర్యాటకులు వస్తుంటారు. అతిథులను ఆహ్వానించేందుకు వరంగల్ జిల్లాకు నాలుగు దిక్కులా స్వాగత తోరణాలు నిర్మిస్తున్నారు. అందులో ఒకటి వరంగల్ బొల్లికుంటలో, రెండోది హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిలో రాంపూర్ వద్ద, మూడోది ఎల్కతుర్తి, నాలుగోది నర్సంపేట వద్ద.. ఇలా నలువైపులా స్మార్ట్ సిటీ నిధులతో ప్రత్యేక స్వాగత తోరణాలు నిర్మించేందుకు అధికారులు పనులు మొదలుపెట్టారు. నిర్మాణాలు పూర్తయితే నగరానికి ప్రత్యేక ఆకర్షణ రానుంది. రోడ్డుకు ఇరువైపులా 8 భారీ స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై కాకతీయుల చరిత్ర, శిల్ప సౌందర్యం ఉట్టిపడేలా నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరంగల్ జిల్లా బొల్లికుంట ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణానికి సంబంధించిన భారీ స్తంభాలను చిత్రంలో చూడొచ్చు. - ఈనాడు, హనుమకొండ



బంతి పూలవనం.. బతుకమ్మ వేడుకలకు సిద్ధం!

బతుకమ్మ పండగ సమీపిస్తున్న వేళ.. ఓ రైతు వేసిన బంతిపూల తోట ఎరుపు, పసుపు రంగుల పువ్వులతో విరబూసింది. మహబూబాబాద్ మండలంలోని మాధవపురం-కురవి రహదారి వెంట వాహనదారులను ఈ తోట ఆకట్టుకుంటోంది.

- న్యూస్‌టుడే, మహబూబాబాద్, నెహ్రూసెంటర్

ఉలిక్కిపడిన అడవి..!

● సిబ్బందిపై దాడులతో ఆందోళన

వారు.. రేయింబవళ్లు అటవీ సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తారు. వారిపైనే దాడి జరగడం అటవీ రక్షణ ఎంత ప్రమాదకరంగా మారిందో చెబుతోంది. ములుగు జిల్లా తాడ్వాయి మండల పరిధి దామెరవాయిలో గురువారం అర్ధరాత్రి ఇద్దరు అటవీ అధికారులపై కొందరు ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరైన పరిష్కారం దొరకడం లేదు.

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి



గాయాల పాలైన అటవీ సిబ్బంది

విధులు.. కత్తిమీద సాము..

ఓ వైపు కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు, పోడుదారులు, అటవీ జంతువులతో ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రయత్నంలో కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కిందట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదంలో గొత్తికోయల చేతిలో శ్రీనివాసరావు అనే రేంజ్ అధికారి ప్రాణాలు పోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

పోడు పేరుతో..

పోడు పేరుతో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో పలువురు అడవులను నరికి వేస్తున్నారు. పోడు పట్టాల సర్వే సమయంలో మూడు జిల్లాల్లో 16 ఘటనలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పోడును అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్నారు.

ఆయుధాలపై నిర్ణయమెప్పుడో?

అటవీ అధికారులు అడవుల్లో ఆయుధాలు లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో స్మగ్లర్లు, పోడుదారులు, వేటగాళ్లతో ముప్పు పొంచి ఉంది. 1982కు ముందు అటవీ అధికారులకు తుపాకులు ఉండేవి. మావోయిస్టుల కదలికలతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మళ్లీ ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ ఉన్నా.. అది నెరవేరడం లేదు.

గతంలో సంఘటనలు

- 2022 నవంబర్ 9న ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపురం గ్రామంలో పోడు జరుగుతుందని తెలిసి వెళ్లిన సెక్షన్, బీట్ అధికారులపై వేట కుక్కలతో దాడి చేయించారు.
- 2022 సెప్టెంబర్‌లో జయశంకర్ జిల్లా పలిమెల మండలం లెంకలగడ్డ గ్రామంలో పోడుభూముల్లో ట్రాక్టర్లతో దున్నుతుండగా.. అటవీ అధికారులు వెళ్లి ఆపేందుకు ప్రయత్నించగా దాడికి పాల్పడ్డారు. ఇద్దరు అధికారులు గాయపడ్డారు.
- 2021 అక్టోబర్‌లో జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం పందిపంపుల గ్రామంలో అటవీభూముల్లో సాగును అడ్డుకునే క్రమంలో అటవీ అధికారులపై పోడురైతులు కారంపొడి చల్లి, పెట్రోల్ పోశారు. మహిళా ఎఫ్‌ఆర్వోతో పాటు ఇద్దరు అధికారులకు గాయాలయ్యాయి.

ఆయుధాలు ఇవ్వడంపై త్వరలో నిర్ణయం

మట్టెవాడ, న్యూస్‌టుడే: అటవీ శాఖ ఉద్యోగులకు ఆయుధాలు అందించే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో



బాధితులు, వారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

చికిత్స పొందుతున్న అటవీ సెక్షన్ అధికారి వినోద్‌కుమార్, బీట్ అధికారి శరత్ చంద్రలను శుక్రవారం పరామర్శించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. దాడులు చేసిన వారిపై పీడీ, హత్యాయత్నం, తదితర కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ములుగు ఎస్పీని ఫోన్‌లో ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి: - ప్రభాకర్, సీసీఎఫ్, కాళేశ్వరం జోన్

అకారణంగా విధులు నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బందిపై దాడులకు పాల్పడ్డారు. గాయాలపాలైన వారిని ఆసుపత్రిలో చేర్పించాం. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. అడవుల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. అటవీ సంపదను కాపాడే సిబ్బందికి అండగా ఉండాలి.

పట్టుబడుతున్నా.. పట్టింపు లేదా?

● జనగామ కలెక్టరేట్‌కు అవినీతి మకిలి
● పది నెలల్లో రెండో అనిశా ఘటన

ఈనాడు, వరంగల్, జనగామ, న్యూస్‌టుడే

అది జిల్లా పాలనా కేంద్రం. కలెక్టర్‌తోపాటు అనేక శాఖల అధిపతులు విధుల్లో ఉంటారు. కొందరు అవినీతి అధికారుల ఆగడాలకు అక్కడ అడ్డు లేకుండా పోతోంది. ఎవరుంటే మాకేంటి? మేం ఏ పనికైనా లంచాలు వసూలు చేసి తీరుతాం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. తమ శాఖ కార్యాలయాలనే అడ్డాగా మార్చారు. అదే జనగామ కలెక్టరేట్.

జనగామ జిల్లాలో గత మూడు మాసాల్లో నెలకొక అవినీతి అధికారి ఏసీబీకి పట్టుబడ్డారు. కొందరు ప్రజాపాలనకు వేదికగా, పౌర సేవా కేంద్రంగా ఉండాల్సిన జిల్లా సచివాలయానికీ అవినీతి మురికిని అంటిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులే లంచావతారమెత్తి సహోద్యోగులను అవినీతి కూపంలోకి దించుతున్నారు. జనగామ ఆర్‌అండ్‌బీ ఈఈ చిలుకపాటి హుసేన్‌తో పాటు, సహాయ సాంకేతిక అధికారి రవీందర్‌లు శుక్రవారం అనిశా అధికారులకు చిక్కడం కలకలం రేపింది.

సైనికుడినీ వదలలేదు: జిల్లాలోని లింగాలఘనపురం మండలం బండ్లగూడేనికి చెందిన చిర్ర సత్యపాల్‌రెడ్డి రెండు దశాబ్దాల పాటు సైన్యంలో దేశానికి సేవలు చేసి 20 ఏళ్ల కిందట ఉద్యోగ విరమణ చేశారు. పెట్రోలు బంకు స్థాపించేందుకు గతంలో చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఇటీవల తమ మండలంలో బంకు ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దీనికి కావాల్సిన నిరభ్యంతర పత్రం కోసం ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో నెలరోజుల కిందట అర్జీ ఇచ్చారు. రూ.17 వేల లంచం ఇవ్వాలని ఈఈ హుసేన్ డిమాండ్ చేసి, బేరం అనంతరం రూ.14వేలకు ఒప్పుకున్నారు. అధికారుల తీరు నచ్చక ఆయన వరంగల్ అనిశా అధికారులను సంప్రదించారు.

సంవత్సరం	ఏసీబీ కేసులు
2020	7
2021	7
2022	9
2023	11
2024	12

వారం కిందట తప్పించుకున్నారు..

వారం కిందటే అనిశా అధికారులు వ్యూహాన్ని అమలు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఆ రోజు ఈఈ లేకపోవడంతో వెనుదిరిగారు. శుక్రవారం టార్గెట్ మిస్ కాలేదు. రూ.14 వేలు ఈఈకి ఇవ్వగా, అందులో నుంచి రూ.2వేలు ఏటీవో రవీందర్‌కు ఇవ్వాలన్న సూచన ప్రకారం ఆయనకు అందజేశారు. శనివారం ఏసీబీ వరంగల్ ప్రత్యేక కోర్టులో వీరిని హాజరుపర్చనున్నారు.



ఆర్‌అండ్‌బి అధికారుల అవినీతి వ్యవహారం.. పట్టివేతపై వివరాలు చెబుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య



ఫిర్యాదుదారు చిర్ర సత్యపాల్‌రెడ్డి

మధ్యవర్తులతో వసూలు

● గత నవంబరు 20న జనగామ మున్సిపల్ కమిషనర్ రజిత రూ.40 వేలు లంచం డిమాండ్ చేసి, సదరు డబ్బును తన కారు డ్రైవర్‌కు ఇవ్వమన్నారు. పక్కా వ్యూహంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకుని కేసు నమోదు చేశారు.
● గత జనవరిలో జిల్లా సచివాలయంలోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి ప్రశాంత్, ఒప్పంద ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.లక్ష డిమాండ్ చేశారు. రూ.50 వేలు ఇచ్చినా సంతృప్తి చెందక, మరో రూ.50వేలకు ఒత్తిడి తేగా సదరు ఉద్యోగిని అనిశాను ఆశ్రయించింది. లంచం తీసుకుంటూ వైద్యాధికారితో పాటు, జూనియర్ అసిస్టెంట్ అజహర్‌లు పట్టుబడ్డారు.

ఎక్కడ వీలైతే అక్కడ

రఘునాథపల్లి మండలం కంచనపల్లి పంచాయతీ కార్యదర్శి తాజా మాజీ సర్పంచి చేసిన పనులకు బిల్లు చెల్లించేందుకు రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. మండల పరిషత్ కార్యాలయంలో సదరు డబ్బు తీసుకుంటూ జులై నెలలో పట్టుబడ్డాడు. పాలకుర్తి మండల మాజీ ఎంపీటీసీ సభ్యుడు చేసిన పనికి బిల్లు చెల్లించేందుకు మండల ప్రత్యేక అధికారి హోదాలో రూ.10వేల లంచం తీసుకుంటూ ఆ మండల ఇరిగేషన్ అధికారి గోపాల్ అనిశాకు చిక్కారు. పనిచేసే చోట కాకుండా నివాసం ఉన్న హనుమకొండ(నక్కలగుట్ట)లోని ఓ చోట లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

వారిద్దరిదీ ఒకే ఊరు

అవినీతి అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం పెరగాలి. తమ పనుల కోసం లంచం డిమాండ్ చేసే వారి ఆటకట్టించాలనే తపన అవసరమంటున్నారు సామాజిక వేత్తలు. ఈఈ హుసేన్ ఆటకట్టించిన సత్యపాల్‌రెడ్డి, జనగామ మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు చేసిన చెట్టిపల్లి రాజు ఇద్దరిదీ బండ్లగూడెం గ్రామమే.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

మామునూరు, పర్వతగిరి, న్యూస్‌టుడే: వరంగల్- ఖమ్మం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృత్యువాత పడ్డారు. మామునూరు ఎస్సై కృష్ణవేణి కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చింతనెక్కొండకు చెందిన కానిస్టేబుల్ డబ్బెట విజేందర్(32) తొర్రూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ..శంభునిపేటలో నివాసముంటున్నారు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. మామునూరు శివారులోని చెరువు కట్ట వద్ద అప్పటికే ట్రాక్టర్ టైర్ పగిలి అందులోని కర్రలు రోడ్డుపై పడిపోయాయి. వీటిని గమనించని ఆయన వాటిని ఢీకొట్టి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన విజేందర్‌ను అటువైపుపై వెళ్తున్న ఆటో డ్రైవర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. శుక్రవారం మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్‌కేకన్ స్వగ్రామమైన చింతనెక్కొండలోని నివాసానికి వెళ్లి విజేందర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పలువురు పోలీస్ అధికారులు, తోటి ఉద్యోగులు విజేందర్ అంతిమయాత్రలో పాల్గొన్నారు.



విజేందర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మాజీ సర్పంచి మృతి

కురవి, న్యూస్‌టుడే: కురవి మండలం బలపాల మాజీ సర్పంచి పిట్టల దర్గయ్య(68) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. సీపీఎం కార్యకర్తగా పని చేయడంతో పాటు 1995లో ఆ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ 2000 వరకు సర్పంచిగా ప్రజలకు సేవలు అందించారు. మత్స్య శాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడిగా చేశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య భద్రమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



దర్గయ్య (పాత చిత్రం)

ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి కోటి జీవరాశుల ప్రాణాలను పరిరక్షించుకుందామంటూ ‘స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో మెప్మా సిబ్బంది పట్టణంలో వినూత్నంగా ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద పురపాలక కమిషనర్ నోముల రవీందర్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. పర్యావరణానికి ప్రమాదం కలిగించే ప్లాస్టిక్ భూతం, మేలు చేసే గోనె సంచి వేషధారణలో పట్టణంలోని ప్రధాన వీధుల్లో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మెప్మా పీడీ విజయ, ఏఈలు సురేష్, కుమార్, పర్యవరణ ఏఈ క్రాంతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, రాజేష్, సీఎల్‌ఆర్‌పీ ఉమ, ఆర్పీలు, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో ప్రదర్శన

క్రీడలతో మానసికోల్లాసం

గార్ల, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎఫ్ఏసీ ఎంఈవో వీరభద్రావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు ఆయన ఆటలపోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్, కోకో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఆటల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులను జిల్లా స్థాయిలో ఆటలకు పంపనున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

కుల నిర్మూలనకు పోరాటం

కొత్తగూడ, న్యూస్‌టుడే: కుల నిర్మూలన కోసం పోరాడాలని న్యూడెమోక్రసీ కొత్తగూడ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రీశైలం పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడలోని ఆ పార్టీ కార్యాలయంలో మహాత్మజ్యోతి రావుపులే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. పార్టీ నాయకులు రాజమల్లు, వెంకటేష్, పూర్ణచందర్, నగేష్, రమేశ్, మంగీలాల్, తదితరులున్నారు.

బయ్యారం: సత్యసోధక్ సమాజ్ స్ఫూర్తితో కుల నిర్మూలన కోసం పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి జగ్గన్న పేర్కొన్నారు. బయ్యారంలో సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పులే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూర్యం, సత్యం, యాకయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

శ్రమదానం



డోర్నకల్, న్యూస్‌టుడే: గొల్లచర్లలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నయారా ఎనర్జీ సంస్థ ప్రతినిధులు, గ్రామస్థులు శుక్రవారం శ్రమదానం చేశారు. ఇక్కడి బంక్ యజమాని సతీష్ పర్యవేక్షణలో మైదానం పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించారు. ముంబై కేంద్రంగా పని చేసే డిప్యూటీ డివిజనల్ మేనేజర్ ఖితీష్ సాహు తదితరులు పాల్గొన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతూ ఆవరణ శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని అవగాహన కల్పించారు. సంస్థ బాధ్యులు అమిత్ ఉపాధ్యాయ, కల్లెపు సతీష్ గౌడ్, దేశిని ఉపేందర్, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు బుచ్చయ్య, ఉపాధ్యాయులు, ప్రజలు భాగస్వాములయ్యారు.

మంత్రాల నెపంతో ఒకరి హత్య



నిందితుడు రాజును చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

ఇనుగుర్తి, నెల్లికుదురు, న్యూస్‌టుడే: మంత్రాల నెపంతో ఒకరు తన సమీప బంధువునే హత్య చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో శుక్రవారం చోటుచేసుకొంది. తొర్రూరు సీఐ జగదీష్, నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లం రాజు కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ కష్టాలకు కారణం తన బాబాయి మల్లం యాకయ్య (66) మంత్రాలు చేయడమేనని విశ్వసించాడు. అదే అనుమానంతో యాకయ్యపై పగను పెంచుకున్నాడు. యాకయ్యను హతమార్చాలని భావించి రాజు పథకం రచించాడు. గ్రామంలో వారిద్దరి నివాస గృహాలు దగ్గరలోనే ఉంటాయి. శుక్రవారం ఉదయం యాకయ్య బహిర్భూమికి చెరువు వైపు వెళుతుండగా మాటు వేసిన రాజు తన వెంట తెచ్చుకున్న కర్రతో అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో యాకయ్య తలకు బలమైన గాయమై ఒక్కసారిగా కిందపడిపోయి మృతి చెందారు. దాడిని గమనించిన సమీపంలో ఉన్న స్థానికులు వెంటనే నిందితుడు రాజును పట్టుకొని తాళ్లతో చెట్టుకు కట్టివేసి సమాచారాన్ని నెల్లికుదురు పోలీసులకు తెలియజేశారు. తొర్రూరు సీఐ జగదీష్, నెల్లికుదురు ఎస్సై రమేష్‌బాబు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య సోమక్క, కూతురు నాగలక్ష్మి ఉన్నారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడైన మల్లం రాజును అరెస్టు చేసినట్లు తెలిపారు.



యాకయ్య (పాతచిత్రం)



హైదరాబాద్‌లో సీఈ అనిత చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న కల్యాణ్

రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక

పెద్దవంగర, న్యూస్‌టుడే: పెద్దవంగర మండలం చిట్యాలకు చెందిన ఈదురు కల్యాణ్ రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గతంలో గ్రూప్-4 ఉద్యోగానికి ఎంపికయ్యారు. తాజాగా టీజీపీఎస్సీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగం సాధించారు. హైదరాబాద్‌లో శుక్రవారం చీఫ్ ఇంజినీర్ అనిత చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చినా చేరలేదన్నారు. గ్రూప్-1 ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమన్నారు.



తొర్రూరు కాంగ్రెస్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న ఝాన్సీరెడ్డి



దంతాలపల్లిలో..



నర్సింహులపేటలో..



చిన్నగూడూరులో..



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలు చిరస్మరణీయం

న్యూస్‌టుడే, బృందం: స్వాతంత్ర్య పోరాటంతో పాటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేక ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కొండా లక్ష్మణ్‌బాపూజీ చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. జిల్లాలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, కార్యదర్శులు, సిబ్బంది తదితరులున్నారు.



కలెక్టరేట్‌లో నివాళులు అర్పిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



గూడూరులో..



మానుకోట పురపాలక సంఘం కార్యాలయంలో ..



ఎస్పీ కార్యాలయంలో..



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

మహబూబాబాద్ టౌన్: విక్రమ్‌నగర్‌కాలనీ ప్రధానవీధిలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. - **ప్రమీల**

సమాధానం: పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - **డొలాగర్ స్వాతి, 26వ వార్డు కౌన్సిలర్.**

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని సుభాష్‌వీధిలో గల ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటితో దోమలు వృద్ధి చెందుతున్నాయి. - **ఆకాశ్**

తగు చర్యలు చేపడతాం. - **భాగ్యలక్ష్మి, వార్డు కౌన్సిలరు, డోర్నకల్**

చెత్త సేకరణ వాహనం వచ్చింది

స్పందనకు వందనం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: భగత్‌సింగ్‌నగర్ కాలనీకి చెత్త సేకరణ వాహనం రావడం లేదని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తోట రాజేష్ స్పందించారు. మున్సిపల్ చెత్త బండి, సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

చెత్త తొలగింపు

డోర్నకల్: డోర్నకల్‌లోని శాంతినగర్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను సిబ్బంది శుక్రవారం తొలగించారు. దీంతో ఆ మార్గాన రాకపోకలు కొనసాగించే వారికి దుర్వాసన బాధ తప్పింది

వీధి దీపానికి మరమ్మతులు

డోర్నకల్: తోడేళ్లగూడెం గ్రామ కూడలిలో వెలగని వీధి దీపానికి శుక్రవారం మరమ్మతులు చేశారు. దీంతో అంధకారం తొలగి వెలుతురు ప్రసరించినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్తు దీపం కోసం.. వృక్షం నరికివేత!



బయ్యారంలో భారీ వృక్షాన్ని పూర్తిగా నరికివేయడం స్థానికులను విస్తుపోయేలా చేసింది. గ్రామం పంచాయతీ ఆధ్వర్యంలో గాంధీ కూడలిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం సమీపంలో విద్యుద్దీపాలు అమరుస్తున్నారు. ఈ క్రమంలో సుమారు అరవై ఏళ్లుగా వాహనదారులు, బాటసారులు నీడనిస్తున్న వేప చెట్టును అధికారులు నరికివేయించడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, బయ్యారం (మహబూబాబాద్)**

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



మురళీధర స్వామి దంపతులకు సన్మాన పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు, పీఆర్‌టీయూ నాయకులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, జంగిలిగొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుత్తోమాల మురళీధరస్వామి ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ వేడుకల మదిరంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన మాట్లాడారు. మురళీధర్‌స్వామి రంగారెడ్డి జిల్లా నుంచి ఉమ్మడి వరంగల్ వరకు పలు పాఠశాలల్లో పని చేసి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ పలు హోదాల్లో సంఘ నిర్మాణానికి మురళీధరస్వామి చేసిన కృషిని శ్లాఘించారు. పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల బాధ్యులు మురళీధర స్వామి దంపతులను సత్కరించారు. పురపాలక సంఘం ఛైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు అందజేత

కురవి, న్యూస్‌టుడే: కురవిలోని నిరుపేదలకు చెందిన వారికి దుస్తులు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మహబూబాబాద్ జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో శుక్రవారం కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయం కూడలిలో వరద బాధితుల సహాయార్థంగా ఎమ్మెల్యే రామచంద్రునాయక్ సూచనల మేరకు 100 మందికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి అందజేశారు. ఆలయ ఛైర్మన్ రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరభద్రం, నాగేశ్వర్‌రావు, డాక్టర్లు విజయలక్ష్మి, సంపత్‌రెడ్డి, చక్రపాణి, మురళీకృష్ణ తదితరులున్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

పెద్దవంగర, న్యూస్‌టుడే: పోషణ్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం కిష్టుతండా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఛైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ నాగవాణి, అంగన్‌వాడీ సూపర్ వైజర్ శోభ మాట్లాడుతూ అప్పుడే జన్మించిన బిడ్డలకు తల్లిపాలు తాగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉపాధ్యాయిని సరళ, రాధిక, రజిత తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి పురస్కారం

తొర్రూరు, న్యూస్‌టుడే: తొర్రూరుకు చెందిన సామాజికవేత్త దొనికెన కుమారస్వామి శుక్రవారం హైదరాబాద్‌లో ఆలూరి కరుణమ్మ స్మారక జాతీయ సాహితీ కళాసేవా పురస్కారం స్వీకరించారు. శ్రీశారద కల్చరల్ లైవ్‌స్టూడియో ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యం, కళ, సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈ మేరకు కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

పెద్దవంగర, న్యూస్‌టుడే: పెద్దవంగర మండల విద్యాశాఖ అధికారిగా బుధారపు శ్రీనివాస్ శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రమేష్‌కుమార్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సతీష్, యూటీఎఫ్ నేత వెంకన్న తదితరులు శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఉపాధ్యాయులు ఐలయ్య, సురేష్, కళాధర్, అంజయ్య, శ్రీధర్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులివ్వాలని వినతి

తొర్రూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ హామీ మేరకు వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వీఆర్‌ఏల వారసులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాకన్న, వెంకటయ్య, మురళి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తొర్రూరు డివిజన్

తొర్రూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డి అన్నారు. తొర్రూరు మాజీ సర్పంచి పెదగాని సోమయ్య జ్వరంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఝాన్సీరెడ్డి శుక్రవారం ఆయనను పరామర్శించారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్ కూతురు ఇటీవల ప్రమాదంలో గాయ పడడంతో ఆమెను పరామర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, ఉప ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల, పట్టణాధ్యక్షులు సంతోష్, సోమరాజశేఖర్, నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును మార్చొద్దు



గార్లలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

గార్ల, న్యూస్‌టుడే: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పేరును మార్చొద్దని ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు పి. వేణుగోపాలరావు కోరారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ నిరహారదీక్ష చేసి ఆత్మబలిదానంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం మహాసభ పిలుపు మేరకు శుక్రవారం గార్లలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఉప తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. మండల కార్యదర్శి కనకశేఖరం, కోశాధికారి కొముమూరి రాకేష్, పుల్లఖండం రమేష్‌బాబు, శ్రీనివాస్, సుదర్శన్, వెంకటేశ్వరరావు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు స్వీయ రక్షణ శిక్షణను ఇచ్చేందుకు శిక్షకులుగా దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో ఇంకా ధ్రువపత్రాల పరిశీలన పూర్తికాని వారి కోసం శనివారం మరో అవకాశం ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వి. రాజేశ్వర్ తెలిపారు. అభ్యర్థులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి తమ ధ్రువ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఇకపై గడువు పొడిగింపు ఉండదన్నారు.

మోసం చేశారనే కేసులో ఒకరికి రిమాండ్

వివాహిత ఆత్మహత్యాయత్నం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: మండలంలోని వంతడపల గ్రామానికి చెందిన తనను మళ్లీ పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని అదే గ్రామానికి చెందిన ముండ్ల మహేష్‌పై ఓ వివాహిత ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మాలోతు సురేష్ పేర్కొన్నారు. అతడ్ని రిమాండ్‌కు తరలించడంతో శుక్రవారం సాయంత్రం ఆ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎనిమిది నెలల కిందట సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో ఆమెకు వివాహమైంది. రెండేళ్ల నుంచి గ్రామానికి చెందిన మహేష్‌తో పరిచయముంది. ఈక్రమంలో మళ్లీ పెళ్లి చేసుకుంటానని నమ్మించి పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని ఆమె ఠాణాలో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి మహేష్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు విషయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినా తనకు న్యాయం జరగలేదని తీవ్ర మనోవేదనకు గురై ఇంటి దగ్గర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికులు, తల్లిదండ్రులు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్సై సురేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వివాహిత ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మాజీ ప్రజాప్రతినిధిని కాపాడిన పోలీసులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో రోదిస్తూ పట్టాలపై వీడియోకాల్ చేసి ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రయత్నించిన ఓ మాజీ ప్రజాప్రతినిధిని కాపాడినట్లు పట్టణ సీఐ దేవేందర్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆమె కుటుంబ కలహాల కారణంగా ఏడుస్తూ ఆత్మహత్య చేసుకొనేందుకు రైలుపట్టాలపైకి వచ్చారన్నారు. పట్టణ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ ఆలీ, జీఆర్పీ పోలీసులు ఆమెను కాపాడి ఇంటికి పంపించినట్లు తెలిపారు.

చోరీకి యత్నం

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: పగిడిపల్లి- చిన్నగూడూరు మధ్యలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ విద్యుత్తు నియంత్రికను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి యత్నంతో పాటు ధ్వంసం చేశారు. నియంత్రికలలోని ఆయిల్, సామగ్రి ధ్వంసం కావడంతో రూ.60వేలు నష్టం వాటిల్లినట్లు ఠాణాలో ఫిర్యాదు చేశామని ఏఈ నవ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కురవి, న్యూస్‌టుడే: కురవి శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం ఆటో మహబూబాబాద్ నుంచి కురవి వస్తుండగా డీసీఎం ఢీకొట్టింది. అందులో ప్రయాణిస్తున్న కురవికి చెందిన బెస్త వెంకటయ్యతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. వారిని మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందుల వెంకటయ్య తలకు బలమైన గాయమైంది. అందులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. డీసీఎం వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. దీనిపై కురవి ఎస్సై సతీశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రమాదంలో వ్యక్తికి గాయాలైనట్లు తెలిసిందన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బయ్యారం, న్యూస్‌టుడే: మండలంలోని జీకేపేటలో బుధవారం రాత్రి వాగ్వాదానికి పాల్పడిన కాంగ్రెస్, భారాస నేతలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కస్తూరినగర్ మాజీ సర్పంచి, భారాస నాయకురాలు బానోతు కృష్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కాంగ్రెస్ నాయకులు సురేష్, మదన్, రవి, రాంబాబు, పుల్లయ్యలపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు మదన్ ఫిర్యాదు మేరకు భారాస మండల ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, రాజేష్, రాము, రమేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

సంక్షిప్తంగా

బొంతల వీరయ్య సేవలు శ్లాఘనీయం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది విద్యావ్యవస్థకు బొంతల వీరయ్య అందించిన సేవలు శ్లాఘనీయమని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులి సతీష్‌రెడ్డి అన్నారు. జయపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు వీరయ్య ఉద్యోగ విరమణ అభినందన సభలో ఆయన శుక్రవారం మాట్లాడారు. ఉపాధ్యాయులు, అధికారులు వీరయ్య, లక్ష్మి దంపతులను సన్మానించారు.

30న సభ

నెల్లికుదురు: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పీడీఎస్‌యూ పని చేస్తుందని తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు బానోత్ నాదిశ్వర్ అన్నారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో సంఘం 50ఏళ్ల సభ గోడపత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

విధుల్లో చేరిక

నర్సింహులపేట: మండల విద్యాధికారిగా బొబ్బిళ్ల రామ్మోహన్‌రావు శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. దంతాలపల్లి: దంతాలపల్లి మండల విద్యాశాఖ అధికారిగా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిత

డోర్నకల్: ప్రాథమిక దశలో ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిత సొంతమవుతుందని డోర్నకల్ మండల విద్యాధికారి(ఎంఈవో) ఆంగోతు లక్ష్మా అన్నారు. ఇక్కడి సెయింటు ఆగ్నెస్ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. బాధ్యతలు చేపట్టాక పాఠశాలకు వచ్చిన లక్ష్మాని కరస్పాండెంటు పసాల ఆంథోని, ప్రధానోపాధ్యాయురాలు హెలెన్‌రాణి పుష్పగుచ్ఛం అందించారు.

ఆకేరు వాగులో ఇసుక ట్రాక్టర్లు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: బ్రాహ్మణకొత్తపల్లి, కొమ్ములవంచ గ్రామాల మధ్య ఆకేరువాగులో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండగా శుక్రవారం తహసీల్దారు కె.రాజు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. రెవెన్యూ అధికారుల చూసిన ట్రాక్టర్ల డ్రైవర్లు వాహనాలను వదిలి పరుగు తీశారు. ఇసుక ట్రాక్టర్లను స్టేషన్ తీసుక రావడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో అధికారులు వాటిని అక్కడే వదిలి వచ్చారు. తహసీల్దారు రాజును వివరణ కోరగా స్టేషన్‌కు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థికసాయం

దంతాలపల్లి: దొనకొండ గ్రామానికి చెందిన ఉప్పుల చంద్రకళ ఇటీవలఅనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని భారాస నాయకులు, గ్రామస్థులు శుక్రవారం పరామర్శించారు. రూ.33 వేల నగదును అందజేశారు.

హామీలు అమలు చేయాలి

చిన్నగూడూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంరాజుపల్లిలో ఏర్పాటు చేసిన శాఖ మహసభల్లో మాట్లాడారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వీరన్నతదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేట గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 5 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు తహసీల్దార్ చప్పిడి నాగరాజు శుక్రవారం తెలిపారు.

హైలెవల్ వంతెన నిర్మించాలని ధర్నా

గార్ల, న్యూస్‌టుడే: పాకాలేటి వద్ద హైలెవల్ వంతెనను నిర్మించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక పాకాలేటి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి జంపాల వెంకన్న, జనార్దన్ తదితరులున్నారు.

ఏకగ్రీవ ఎన్నిక

గార్ల, న్యూస్‌టుడే: కల్లుగీత సంఘం అధ్యక్షుడుగా తోడేటి విజయరాముడుగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గార్లలో శుక్రవారం ఆ సంఘం సమావేశం జరిగింది. గీతసంఘం నాయకులు, గౌడ సంఘం సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రాత పుస్తకాల పంపిణీ

కొత్తగూడ, న్యూస్‌టుడే: సీతక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడ మండలం కిష్టాపురం పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు, విద్యా సామగ్రిని సీతక్క కోడలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు కుసుమాంజలి అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్‌రెడ్డి, కొత్తగూడ మాజీ సర్పంచి మల్లెల రణధీర్, , శ్రీకాంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్యాక్స్ బలోపేతానికి రైతులు తోడ్పడాలి

బయ్యారం, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(ప్యాక్స్) బలోపేతానికి రైతులు అన్ని విధాలుగా తోడ్పడాలని అధ్యక్షుడు మూల మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. బయ్యారం ప్యాక్స్ కార్యాలయంలో శుక్రవారం మహాజన సభను నిర్వహించారు.

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమం

గార్ల, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో యువత ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ కోరారు. సర్దార్ భగత్‌సింగ్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక భగత్‌సింగ్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడి నివాళులర్పించారు. నాయకులు వీరస్వామి, రామకృష్ణ, నాగరాజు, కోటయ్య, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు ఉన్నారు.

రైతన్నలకు వెన్నెముకగా నిలుస్తున్నాం

గూడూరు, న్యూస్‌టుడే: రైతులకు సహకారాన్ని అందించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు వెన్నెముకగా నిలుస్తున్నాయని పీఏసీఎస్ ఛైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజనసభ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. లింగారెడ్డి మాట్లాడుతూ సహకార సంఘంలోని రైతులు రూ.4.59 కోట్ల రుణమాఫీ పొందగా వాటిని తిరిగి పునరుద్ధరించామన్నారు.

విద్యుత్తుశాఖ సిబ్బంది సేవలు భేష్



ఎదుళ్లపల్లిలో రాత్రివేళ..

కొత్తగూడ, న్యూస్‌టుడే: ఎదుళ్లపల్లిలో గురువారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు నియంత్రిక వద్ద ఏర్పడిన సాంకేతిక సమస్యతో గ్రామం మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయి చీకటిగా మారింది. వర్షాకాలంలో విషపురుగుల సంచారం ఉందని విద్యుత్తు సిబ్బందిని కోరగా ఏఎల్ఎం కిరణ్, జేఎల్ఎం మహేష్‌లు సుమారు మూడు గంటలపాటు శ్రమించి మరమ్మతు పనులు చేసి విద్యుత్తు సరఫరా చేశారు. దీంతో గ్రామస్థులు విద్యుత్తుశాఖ సిబ్బంది సేవలను కొనియాడారు.

గ్రామసభలో గందరగోళం

కురవి, న్యూస్‌టుడే: కురవి పంచాయతీ గ్రామసభ గందరగోళం మధ్య జరిగింది. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఈవో విజయలక్ష్మి అధ్యక్షతన సభ ప్రారంభమైంది. సమస్యలపై చర్చించిన తరువాత గిరిజన ఏకలవ్య గురుకులంలో మరుగుదొడ్ల మరమ్మతులు, చేపట్టనున్న పనుల కోసం ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. పనులు చేయడానికి పంచాయతీ తీర్మానం ప్రకారం చేయాల్సి ఉంటుంది. తీర్మానం చేయాలని మాజీ ఉప సర్పంచి భరత్ ప్రశ్నించగా మిగతా వారు కూడా మేము చేస్తామంటూ ముందుకొచ్చారు. దీంతో కాసేపు గందరగోళం జరిగింది. చివరకు మెజారిటీ సభ్యులు చేతులు ఎత్తడంతో వాటిని అదే గ్రామానికి చెందిన రాజేందర్‌కు ఇవ్వాలని తీర్మానించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని చేయాలని సూచించారు. సభలో ఎంపీడీవో వీరబాబు, తహసీల్దార్ సునీల్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



దంతాలపల్లి శివారు కాటన్ మిల్లు వద్ద రహదారిపై కూలిన మర్రి చెట్టు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: 563వ జాతీయ రహదారిపై భారీ వృక్షం కూలిపోయిన ఘటనలో ప్రమాదం తప్పింది. ఈ సంఘటన వరంగల్-ఖమ్మం రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.... దంతాలపల్లి- పడమటిగూడెం గ్రామాల మధ్యలో కాటన్ మిల్లు వద్ద మర్రి చెట్టు ఒక్కసారిగా రోడ్డుపై కూలిపోయింది. కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు భూమి పదునుతో ఉండటంతో చెట్టు వేర్లతో బయటకొచ్చి కూలిందన్నారు. ఆ సమయంలో రహదారిపై వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం చోటు చేసుకుంది. డోజర్‌తో పడిపోయిన చెట్టును తొలగించిన పోలీసులు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వల్లూరి పద్మ భర్త భారాస సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి(61) అనారోగ్య కారణంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ నవీన్‌రావు, కాంగ్రెస్ నాయకులు యుగేందర్‌రెడ్డి, కమలాకర్, మురళీధర్‌రెడ్డి, రంగారెడ్డి వివిధ పార్టీల నాయకులు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.